

# పేదల బియ్యం.. పక్కదారి

**రైస్ డిపో పై విజిలెన్స్ అధికారుల దాడులు**

**32 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత**

**బియ్యాన్ని అనధికారికంగా విక్రయిస్తే కఠిన చర్యలు**

**విజిలెన్స్ డిఎస్పి వెంకటేశం.**

నారాయణఖేడ్, మార్చి 10 (సిరి న్యూస్): పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం సబ్సిడీ కింద అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. నిరుపేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం.. అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ఏళ్లుగా అదే తంతుగా ఒకే పంథాలో సాగుతున్న రేషన్ బియ్యం దందాకు ఏమాత్రం అడ్డు కట్ట పడటం లేదు. అడపాదడపా చేస్తున్న దాడుల్లోనే రేషన్ బియ్యం పట్టుబడుతుండగా.. అధికారుల కళ్లు గప్పి పక్కదారి పడుతున్న బియ్యం విలువకు లెక్కేలేదు.

పేదల బియ్యం గద్దెల పాలు అన్నట్టు ప్రభుత్వాలు ఓ మంచి ఉద్దేశంతో నిరుపేదలు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో ఉచితబియ్యాన్ని ప్రవేశపెడితే అక్రమార్కులు దీన్ని ఆసరాగా చేసుకుని మూడు పువ్వులు ఆరు కాయలుగా దళారులు రేషన్ దందాను కొనసాగిస్తున్నారు. నామ్ కే వాస్తేగా కొన్ని 25 కిలో బ్యాగులు పెట్టుకొని షాప్ మాదిరిగా కొనసాగిస్తూ లోపట మాత్రం మొత్తం పిడిఎస్ బియ్యాన్ని తీసుకొని బ్లాక్ మార్కెట్లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు దళారులు. నారాయణఖేడ్ పట్టణంలోని ఓ రైస్ డిపో దుకాణదారుడు అక్రమంగా నిల్వ ఉంచిన 32 క్వింటాళ్ల పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పీడీఎస్) బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించి పట్టుకున్నారు. విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో నిర్వహించిన తనిఖీల్లో ఈ అక్రమ నిల్వలు బయటపడ్డాయి. ప్రభుత్వ సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి వ్యాపారం చేస్తున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇం కా ఎవరైనా అక్రమంగా నిల్వ చేస్తే మాకు సమాచారం ఇవ్వాలని వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ బియ్యాన్ని అనధికారికంగా విక్రయించే వ్యక్తులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై పండరీ, వెంకటేశ్వర్లు, రిటైర్డ్ తహసిల్దార్ ప్రభాకర్, స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సిఆర్పి కుటుంబాలకు రూ.12లక్షలు ఆర్థికసాయం

### అండగా నిలిచిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

**చేగుంట, మార్చి 11 సిరి న్యూస్**

చేగుంట మండలం మక్కారాజపేట ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు సిఆర్పి లు చందాయ్ పేట గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనివాస్, జైత్రం తాండకు చెందిన మాలోత్ శ్రీనివాస్ నాయక్‌లకు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్నటువంటి సమగ్ర శిక్ష ఉద్యోగులు వివిధ మండలాల్లో డబ్బులు సేకరించారు. అలావచ్చిన డబ్బుల చెక్కులను సోమవారం జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధా కిషన్ చేతుల మీదుగా ఆ కుటుంబాలకు రూ. 12 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ జ్యోతి, సుదర్శన మూర్తి, మండల విద్యాధికారి నీరజ, రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి, శేషాద్రి, సంపత్, రాజు, చల్ల లక్ష్మణ్, పాల్గొన్నారు.



## తపస్‌లో చేరిన టీచర్లు

**పెద్ద శంకరం పేట, మార్చి 10 (సిరి న్యూస్):**




మండల పరిధిలోని పలువురు టీచర్లు తపస్ ఉపాధ్యాయ సంఘంలో చేరారు. జిల్లా తపస్ అధ్యక్షులు జిడ్డి ఎల్లం, రాష్ట్ర నాయకులు, పిజి వాచ్ఎం రమేష్ ఆధ్వర్యంలో సత్య కుమార్, ప్రవీణ్ కుమార్, బేతయ్య, గోపాల్‌లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘంలో చేరిన వారిలో ఉన్నారు. వారికి తపస్ లోనికి స్వాగతం పలుకుతున్నట్లు మండల శాఖ అధ్యక్షులు గుజ్జరి రవి, ప్రధాన కార్యదర్శి కాన్షీరాం జాదవ్‌లు తెలిపారు.